క్లుప్తంగా

ఉపాధ్యాయుడిపై చర్య తీసుకోవాలి

భూపాలపల్లి అర్బన్: రేగొండ మండలంలోని మడ్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులను మానసికంగా వేధిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో ఉపాధ్యాయులు తమను మానసికంగా, శారీరకంగా, లైంగికంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని నెల రోజుల క్రితం పాఠశాల ఎదుట ధర్నా చేసినట్లు తెలిపారు. దీంతో విచారణ చేసిన అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, క్రాంతికుమార్, శ్రీనివాస్, సందీప్, రమేష్ పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ సీట్ల సంఖ్య పెంచాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పించే బెస్ట్ అవైలబుల్ సీట్ల సంఖ్యను పెంచాలని ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షుడు మడికొండ రఘుపతి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డిని కోరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంతో పాటు సమీప మండలాల్లో అనేక మంది ఎస్సీ నిరుపేద విద్యార్థులు ఉన్నారని ఉచితంగా విద్యనభ్యసించే అవకాశం కల్పించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి–చెల్పూర్ మధ్య జాతీయ రహదారిపై మంజూర్‌నగర్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానిక ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దపూర్ గ్రామానికి చెందిన గట్టు రఘు(30) తన మోటార్ సైకిల్‌పై భూపాలపల్లికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా.. కేటీకే–8వ గని మూలమలుపు వద్ద వెనుకవైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో రఘు తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. రఘు భార్య స్నేహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

నిందితుడి అరెస్టు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని మడ్తపల్లికి చెందిన సూర సుధాకర్ కొయ్యడ రఘుపై దాడి చేసి, కులం పేరుతో దూషించగా మంగళవారం అతనిపై కేసు నమోదు చేశారు. కాగా బుధవారం అతన్ని అరెస్టు చేసి జిల్లా కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

బాలిక అదృశ్యం

మహదేవపూర్: మహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ఓ బాలిక (15) సంవత్సరాలు రెండు రోజుల నుంచి కనిపించడం లేదు. దీంతో బాలిక తల్లి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్సై రాజకుమార్ మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సంతలో ట్రాఫిక్ జామ్



టేకుమట్ల: ప్రతీ బుధవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న వారసంత బుధవారం జనాలతో కిక్కిరిసి వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ జామ్ అయింది. రోడ్డుకు ఇరువైపులా సంతను నిర్వహిస్తుండగా సంతకు వచ్చిన జనంతో సంత మొత్తం జనాలతో నిండి వాహనాల రాకపోకలకు కాస్త అంతరాయం కలిగింది. వార సంతకు మండలంలోని పలు గ్రామాల ప్రజలు రావడంతో జనాలతో కిక్కిరిసింది. కావున స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి వార సంతను ప్రత్యేక చోటికి తరలిస్తే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందని పలువురు కోరుకుంటున్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి

భూపాలపల్లి రూరల్: తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులుగా నాలుగు సంవత్సరాల ప్రొబేషన్ పీరియడ్ పూర్తి చేసుకున్న తమను రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ.. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ ఫెడరేషన్ అధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ..మొదట మూడు సంవత్సరాలు ఉన్న ప్రొబేషన్ పీరియడ్‌ను సీఎం కేసీఆర్ నాలుగు సంవత్సరాలకు పొడిగించారని, ఆనాలుగు సంవత్సరాల గడువు ముగిసినందున తమను వెంటనే రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామన్నారు. లేని పక్షంలో రాష్ట్ర సంఘం కార్యాచరణ మేరకు ఏప్రిల్ 28 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం నాయకులు రాంబాబు, రాములు, మనోజ్,నాయకులు, సందీప్, వినోద్, తదితర పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

సమన్వయంతో పనిచేయాలి

- ఎంపీపీ చింతలపల్లి మలహర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మలహర్‌రావు

మహాముత్తారం(మల్హర్): అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ మలహర్‌రావు అన్నారు. మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. వల్లెంకుంట సర్పంచ్ సెనిగరం రమేష్ సర్పంచ్‌ల అనుమతి లేకుండా అధికారులు పంచాయతీ నిధులను డిజిటల్ కీతో ఖర్చు చేశారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ పంచాయితీ నిధుల విషయంలో ప్రతీ సమాచారాన్ని అధికారులు.. సర్పంచ్‌లకు తెలియపర్చాలని సూచించారు. ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో తాగునీరు నీడ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ఐకేపీ సిబ్బంది ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీఎం కమలకు సూచించారు. వేసవి కాలం నేపథ్యంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా పనులు చేయాలన్నారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల విషయంలో ఎదురయ్యే ఇబ్బందులపై ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నర్సింహమూర్తి, తహసీల్దార్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ప్రకాష్‌రావు, మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ అనంతరెడ్డి పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

నాటిన ప్రతిమొక్కనూ సంరక్షించాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు

మహదేవపూర్: హరితహారంలో భాగంగా నాటేందుకు నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలను వంద శాతం సంరక్షించి, నాటిన తర్వాత ఏ ఒక్క మొక్క ఎండిపోకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ రాణిబాయి అన్నారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఎండ తీవ్రతకు మొక్కలు చనిపోకుండా ప్రతీ నర్సరీలో షేడ్ నెట్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం సాయంత్రం, వేళల్లో నర్సరీలో మొక్కలకు వనసేవకు ద్వారా నీటిని పట్టించాలని, వందశాతం మొక్కలను రక్షించాలని పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. అంతేకాకుండా ప్రస్తుతం వేసవికాలంలో వ్యవసాయ పనులు ఉండనందున కూలీలకు అధిక మొత్తంలో ఉపాధి కల్పించేందుకు ప్రతి గ్రామపంచాయతీకి 200 తగ్గకుండా కూలీలు ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. హరితహారం కార్యక్రమంలో రోడ్డుకు ఇరు ప్రక్కలా అవెన్యూ ప్లాంటేషన్ పద్ధతిలో నాటిన మొక్కలకు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా వాచర్ల సహాయంతో నీరును పట్టించాలని చెప్పారు. ట్రీ గార్డులు కింద పడిపోకుండా ఎప్పటికప్పుడు వాచర్ల సాయంతో సరి చేయించాలని, వాచర్లతో మొక్క చుట్టూ ఉన్న గడ్డిని తొలగించి నీరు నిలిచేలా చర్యలు చేపట్టాలన్నారు. నాటిన ప్రతి మొక్క బతికేటట్లు గ్రామపంచాయతీ ప్రత్యేక చర్య తీసుకోవాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ రవీంద్రనాథ్, ఎంపీఓ ప్రసాద్, ఏపీఓ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం

- గండ్ర సత్యనారాయణరావు



యాత్రలో మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ ఇల్లు నిర్మిస్తామని టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు హామీ ఇచ్చారు. బుధవారం మండలంలోని కాసులపహాడ్, నర్సింగాపూర్, వేములపల్లి, బంగ్లాపల్లి, గుడిపహాడ్, ఎల్లారెడ్డిపల్లి, పిడిసిల్ల గ్రామాలల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలతో కూడిన కరపత్రాన్ని ప్రజలకు అందజేశారు. యాత్ర మధ్యలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ జెండాను గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇస్తామన్నారు. రూ.500 లకే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తామని తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడుస్తున్నా, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం అందరిని ద్రాక్షగానే మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బెల్ట్ షాపులను బంద్ చేస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఇప్పటివరకు ఒక్క ఎకరానికి కూడా నీరు అందించని ఘనత బీఆర్ఎస్ దేనని ఎద్దేవా చేశారు. ఇప్పుడు వ్యవసాయ భూములకు పారే నీరంత కూడా కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టుల ద్వారా వస్తున్నవే అని గుర్తుచేశారు. అవినీతిపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. తన మిత్రుడు అదానీ ఆర్థికంగా ఎదగడానికి మాత్రమే మోదీ కృషి చేస్తున్నారని విమర్శించారు. అదానీ వ్యవహారం ప్రపంచ వేదికగా బట్టబయలైన విషయాన్ని దాచిపెట్టడానికి పార్లమెంటులో రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలను రికార్డుల నుంచి తొలగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తలు లక్షలాదిగా ఉన్నారని గండ్ర సత్యనారాయణ అన్నారు. యాత్రలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆకుతోట కుమారస్వామి, పోలినేని లింగారావు, బండి సుదర్శన్ గౌడ్, రాజు, ఓనపాకల ప్రసాద్, చిలుకూరి దేవేందర్ రెడ్డి, పసరగొండ మహిపాల్, ఓనపాకల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

బోర్డు మాత్రమే ఉంది..!

- కానరాని ఆటవస్తువులు
- నిరుపయోగంగా క్రీడాప్రాంగణం



బీసీ మల్లిగూడెం పంచాయతీలో బోర్డు పెట్టి వదిలేసిన క్రీడాప్రాంగణం

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బీసీ మల్రిగూడెం పంచాయతీలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ క్రీడా ప్రాంగణం బోర్డులకే పరిమితమైందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ క్రీడా ప్రాంగణంలో యువతి యువకులు, చిన్నారులు ఆడుకునేందుకు గాను ఎలాంటి ఆట వస్తువులను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో కనీసం వాలీబాల్, బ్యాట్ మెంటన్ కోర్టులను కూడా ఏర్పాటు చేయలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణంలో అన్నిరకాల సౌకర్యాలను కల్పించాలని గ్రామస్తులు, యువకులు కోరుతున్నారు.

శ్రీధర్‌బాబును విమర్శించడం అవివేకం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాటారం: మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుపై విమర్శలు చేయడం పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అవివేకానికి నిదర్శనం అని కాటారం ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కాటారం మండలం దామెరకుంటలో బుధవారం కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. శ్రీధర్‌బాబుపై పుట్ట మధు చేసిన ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. 2016లో ప్రారంభమైన డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణం ఇప్పటి వరకు పూర్తికాకపోవడం పుట్ట మధు వైఫల్యమేనని ఆరోపించారు. ఎమ్మెల్యేగా పని చేసి ప్రస్తుతం జెడ్పీ చైర్మన్‌గా అధికార పార్టీలో ఉండి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించాల్సింది పోయి ప్రతిపక్షంలో ఉన్న శ్రీధర్‌బాబును విమర్శించడం సిగ్గుచేటన్నారు. నాలుగు సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న పుట్ట మధు ఎన్ని అక్రమ ఆస్తులు సంపాదించారో మంథని ప్రజలకు తెలుసన్నారు. శ్రీపాదరావు, శ్రీధర్‌బాబు చేస్తున్న సేవలు గుర్తించే ప్రజలు ప్రతి ఎన్నికల్లో అధిక మెజార్టీతో శ్రీధర్‌బాబును గెలిపిస్తున్నారని అన్నారు. అవగాహనరాహిత్య ఆరోపణలు, విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని, ప్రజలు మళ్లీ తగిన గుణపాఠం చెపుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, పీసీసీ మహిళా రాష్ట్ర కార్యదర్శి ఆంగోతు సుగుణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి కుంభం స్వప్న, సర్పంచ్ తెప్పెల దేవేందర్‌రెడ్డి, చీమల రాజు, చీర్ల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

మహాముత్తారం(మల్హర్): మానేరు బ్రిడ్జినుంచి తాడిచర్ల వరకు ఉన్న మట్టి రోడ్డుపై బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఏఎంఆర్ కంపెని పీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. మట్టి రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారులు దుమ్ముధూళితో ఇబ్బంది పడుతున్నారని బ్రిడ్జి నిర్మాణం పూర్తయినందున తాడిచర్ల, మల్లారం, చిన్న తూండ్ల, పెద్దతూండ్ల పలు గ్రామాలకు ఈ రహదారి వెంబడే ప్రయాణిస్తుంటారు. అదేవిధంగా ఆర్టీసీ బస్సులతో పాటు పలు వాహనాలు ఈ రహదారివెంట రాకపోకలు సాగిస్తుంటాయి. ఏఎంఆర్ కంపెనీ ఆధ్వర్యంలో వేసిన మట్టి రోడ్డును తొలగించి, బీటీరోడ్డు వేసి ప్రజలు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని వినతి పత్రంలో కోరారు.
వినతి పత్రం అందజేసిన వారిలో తాడిచర్ల సింగిల్ విండో చైర్మన్ మల్క సూర్యప్రకాష్‌రావు, తాడిచర్ల ఎంపీటీసీ1 రావుల కల్పన, బీఆర్ఎస్ నాయకులు బండి రాజయ్య, బుడిద మల్లేష్, అన్నమనేని మధు, రామిడి గట్టయ్య, గుమ్మడి రవి, బూడిద సదానందం, అక్కపాక సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి వినతి పత్రం అందజేత

మహాముత్తారం(మల్హర్): తమను ప్రొబెషరీ పీరియడ్ పూర్తి అయినప్పటికీ ప్రభుత్వం రెగ్యులైజేషన్ చేయడంలేదని.. వెంటనే క్రమబద్దీకరించాలని ఎంపీపీ మల్హర్‌రావుకు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన జూనియర్ పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ కానుక అందజేత



కానుకలు అందజేస్తున్న నాయకులు

కాటారం: రంజాన్ నేపథ్యంలో మండల కేంద్రంలోని మజీద్‌లో ముస్లింలకు బుధవారం పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి వ్యక్తిగతంగా రంజాన్ కానుకలు అందజేశారు. చీరతో పాటు సేమియా, చక్కెర, కర్జూరాలతో కూడిన కానుకను 160 కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రంజాన్ పండుగ ఐక్యతకు నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్ ముస్లిం, మైనార్టీల అభివృద్ధికి పెద్దపీత వేస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ రానున్న రోజుల్లో భారత ప్రధాని కావాలని అకాంక్షించారు. ముస్లిం ఆడబిడ్డలకు షాదీముబారక్ అందజేసి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చల్ల సుజాత, నాయకులు దబ్బెట రాజేశ్, డోలి అర్జయ్య, శంకర్‌రెడ్డి, గోగుల రాజేశ్, మల్లేశ్, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బియ్యం అందజేస్తున్న నాయకులు

మహాముత్తారం: మండలంలోని కనుకునూర్ గ్రామానికి చెందిన చెన్నూర్ దుర్గమ్మ ఇటీవల మృతిచెందింది. దుర్గమ్మ కుటుంబాన్ని బుధవారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి, 50కేజీల బియ్యాన్ని అందజేశారు. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మాజీ కోఆప్షన్ సభ్యుడు సాలార్‌బేగ్ అనారోగ్యం బారినపడటంతో అతన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి, మహాముత్తారం ఎంపీటీసీ శ్రీపతి సురేష్, బీఆర్ఎస్ నాయకులు వినోద జగపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

టేకుమట్ల: గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై చల్ల రాజు కోరారు. బుధవారం మండలంలోని గర్మిళ్లపల్లిలో సర్పంచ్ నల్లబెల్లి రమ ఆధ్వర్యంలో మేము సైతంలో భాగంగా సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లోని కూడళ్లలో, రద్దీ ప్రాంతాల్లో, గ్రామ ప్రారంభం, చివరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామంలోకి వచ్చి అసాంఘిక కార్యక్రమాలు, చోరీలకు పాల్పడితే సులభంగా గుర్తించవచ్చని అన్నారు. వ్యాపారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎలాంటి దొంగతనాలకు తావులేకుండా ఉండవచ్చని తెలిపారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీల్లో త్వరలోనే అందరి సహకారంతో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత మండలంగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఏనుగు తిరుమల, నాయకులు రవీందర్, లచ్చిరెడ్డి, వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి

- స్పందించిన పూర్వ విద్యార్థి నాగరాజు



విద్యార్థులకు టీ షర్టులు అందజేస్తున్న దాతలు

చిట్యాల: తాను చదువుకున్న పాఠశాలలో సమస్యల పరిష్కారంలో తనవంతుగా సాయం అందించాడు పూర్వ విద్యార్థి నాగరాజు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001–2002 సంవత్సరంలో మండల కేంద్రానికి చెందిన తౌటం నాగరాజు విద్యాభ్యాసం చేశాడు. ప్రస్తుతం వృత్తి రీత్యా లండన్‌లో వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల చదువుకున్న పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నాడు. చదువుకున్న స్కూల్‌కి తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో రూ.70వేలు విలువ చేసే 150 టీషర్ట్స్, వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు, కుర్చీలు, వాటర్ క్యాన్స్ సెట్, క్రీడా సామగ్రిని కొనుగోలు చేసి తన తండ్రి తౌటం అంతులు చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా నాగరాజుకు ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, చిట్యాల ఎంపీటీసీ, జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి కట్కూరి పద్మ నరేందర్‌లు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తౌటం అంతులును సన్మానించారు. కార్యక్రమంలో రఘుపతి, ఎస్ఎంసీ చైర్మన్ అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నిమతాల అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి

- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: అన్ని మతాల అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం భూపాలపల్లి పట్టణకేంద్రంలోని జామ మసీద్‌లో రంజాన్ పండుగ పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు ఇస్తున్న ఇఫ్తార్ విందు కార్యక్రమానికి కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా మత పెద్దలకు స్వీట్లు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ముస్లింలకు షాదీఖాన నిర్మాణానికి ఇప్పటికే రూ.75 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. అందుకు కావాల్సిన స్థలాన్ని పరిశీలించి కేటాయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. మంజూర్ నగర్ రామప్ప కాలనీ దగ్గరలో ఖబ్రస్తాన్ నిర్మాణానికి 3 గుంటల స్థలం కేటాయించాలని సింగరేణి ఏరియా జీఎంను కోరారు. ముస్లింలకు ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ కానుకలను అందచేశారు ఈ కార్యక్రమంలో మత పెద్దలు కమలోద్దీన్, భూపాలపల్లి తహశీల్దార్ ఇక్బాల్, మాజీ ఎంపీపీ కళ్లెపు రఘుపతి రావు, పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం

వాజేడు: మండల పరిధిలోని సుందరయ్య కాలనీకి చెందిన పద్దం చంద్రయ్యకు చెందిన మోటార్ సైకిల్‌ను బంధువులకు చెందిన యువకుడు ధర్మవరం గ్రామానికి పని పై తీసుకెళ్లాడు. చెరుకూరు, ధర్మవరం గ్రామాల మధ్యకు వెళ్ల గానే మోటార్ సైకిల్ లోపలి నుంచి మంటలు చెల రేగాయి. మోటార్ సైకిల్ పూర్తిగా కాలి దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణం అయి ఉంటుందని భావిస్తున్నారు.

ఆదర్శలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న చైర్మన్


కాటారం: మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్‌లో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రీ స్కూల్ విద్యను పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, మెడల్స్, బహుమతులను అందజేశారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా ప్రీ ప్రైమరీ విద్యార్థులు సృజనాత్మకతతో రూపొందించిన పలు చార్టులు, వివిధ ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా చైర్మన్ కరుణాకర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామ శివారు చలివాగు నుంచి అక్రమంగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. అనంతరం ఇసుకలోడు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని ట్రాక్టర్ డ్రైవర్, ఒనర్ ఎండీ రఫీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

మొగుళ్లపల్లి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం కోర్కిశాల గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రేణికుంట్ల రిజిస్ట్రేషన్ లేని స్వరాజ్ ట్రాక్టర్‌తో ఎలాంటి అనుమతులు లేకుండా పోతుగల్లు వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా బుధవారం ఉదయం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

మహాముత్తారం: కనుకునూర్‌కు చెందిన చీకట్ల మానస అనారోగ్యంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ నిధులకోసం దరఖాస్తు చేసుకుంది. దీంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.25వేల చెక్కును బుధవారం కనుకునూర్‌లో మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి అందజేశారు. సర్పంచ్ కుడుముల లక్ష్మి, ఎంపీటీసీ శ్రీపతి సురేష్, జేపాల్‌నాయక్, చీకట్ల లింగయ్య పాల్గొన్నారు.

మహాముత్తారం(మల్హర్): మల్హర్ మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా.. బుధవారం తాడిచర్లలో ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, వైస్ఎంపీపీ బడితెల స్వరూప రాజయ్య, సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ నాగరాణి, ప్రకాష్‌రావు, రాజేశ్వర్‌రావు ఉన్నారు.

సాక్షి
దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274